మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి

బస్తీబాట పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూలై 10 : మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, తెలంగాణ దళితదండు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బచ్చలకూర బాలరాజు అన్నారు. బుధవారం బస్తీబాట పోస్టర్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా విడుదల చేశారు. మాదిగల హక్కుల కోసం బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో దళితదండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొగులయ్య, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సురేశ్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమస్యలు పరిష్కరిస్తాం

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

త్రిబుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థినీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట రూరల్, జూలై 10 : ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. పాఠశాలల్లో ఇటీవల నిర్వహించిన బడిబాట కార్యక్రమం అమలుపై గురువారం డీఈవో గోవిందరాజులు, హెచ్ఎంలతో పట్టణంలోని బీకే ఫంక్షన్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి సమస్య, కొత్త భవనాలు, వంటశాలలు అవసరమైనవి ఎంఈవో ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో సమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, బాలకిషన్‌చంద్రుడు, శంకర్‌నాయక్, నోడల్ అధికారి జీవన్‌కుమార్, జీహెచ్ఎంలు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, కస్తూర్బా ఎస్ఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం..

ఉప్పునుంతల, జూలై 10 : కష్టపడి చదివితే సాధించలేనిదేమీ లేదని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 9.8జీపీఏ సాధించి బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన ఎండీ సమీరను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్థికసాయం అందించారు. అలాగే కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి రూ.10వేలు అందచేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావ్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

జీపీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

చారకొండ, జూలై 10 : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జేపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తాజా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. రైతులకు ఆగస్టు 15లోపు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పారు. అదేవిధంగా గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, యువనేత ఆశాదీప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఉప్పునుంతల, జూలై 10 : ఉప్పునుంత ల బీసీకాలనీకి చెందిన శ్రీకాంత్(20) బైక్‌పై ఉప్పునుంతల నుంచి సదగోడుకు వెళ్తుండగా, మార్గమధ్యలో బైరబండ సమీపంలో బోరుబండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం వెల్దండ సమీపంలో గల యెన్నం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

తాజా మాజీ ఎంపీటీసీలకు సన్మానం

పెద్దకొత్తపల్లి, జూలై 10 : పదవీ బాధ్యతలు ముగిసిన మండలంలోని సాతాపూర్ ఎంపీటీసీ వెంకటయ్య, చిన్నకార్పాముల ఎంపీటీసీ మాధవిని బుధవారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కురుమూర్తి, రాజు, నిరంజన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, జూలై 10 : మండలంలోని బొమ్మరాజుపల్లి తాజా మాజీ ఎంపీటీసీ గోపాల్‌గుప్తను గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, రాజురెడ్డి, ఆంజనేయులు, మలేశ్‌గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

అచ్చంపేట రూరల్, జూలై 10 : అచ్చంపేట డిపో నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్, పుట్టపర్తిలకు ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 1995 నుంచి రెండు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉండేవన్నారు.

హక్కులు కల్పించాలి

ఊర్కొండ, జూలై 10 : రాయి కొట్టి జీవనం సాగిస్తున్న తమకు గుట్టపై పూర్తి హక్కులు కల్పించాలని తాసీల్దార్ చిన్నకిష్టప్పకు వడ్డెర కులస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. దళారులు రాళ్లు కొట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బహిరంగ ప్రకటన

తేది:10-07-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు పిట్టల జంగయ్య తండ్రి పిట్టల బాలరామ్, నివాసము ఇం.నెం.6-60, అవంచ గ్రా।, తిమ్మాజిపేట్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట్ మండలము, అవంచ గ్రామ శివారులో గల భూమి సర్వే నెం.61/ఈ, విస్తీర్ణం ఎ.00-31 గుంటలు గల భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ 351/2022 గలదు. ఇవ్వుడు నా క్లయింటు వద్ద లభ్యముగా లేదు. ఇట్టి విషయమై తగు చర్య నిమిత్తం సంబంధిత పోలీసు వారికి దరఖాస్తు ఇవ్వగా "Missing Certificate" ఇచ్చియున్నారు. కావున తెలియజేయునది ఏమనగా ఇట్టి భూమిపై ఎవరికైన వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలు, తదితరములు ఏమైనా అభ్యంతరాలు, హక్కులు, క్లెయిములు ఉన్నయెడల క్రింది చిరునామాలో (7) రోజులలో తమ అభ్యంతరాలను, హక్కులను తగు దస్తావేజులతో సంప్రదించగలరు. మరియు ఎవరికైన ఇట్టి దస్తావేజు దొరికినచో క్రింది చిరునామాలో ఇవ్వగలరు. భవిష్యత్తులో వచ్చు ఏదేని న్యాయ పరమైన చిక్కులు, వివాదాలు నివారించుటకు ఇట్టి బహిరంగ ప్రకటన జారీ చేయునైనది.

పై కనబరచిన భూమి యొక్క హద్దులు :
తూర్పు: సి.సత్యనారాయణ రెడ్డి గారి భూమి, **పడమర:** KLI కాలువ , **ఉత్తరము:** గుడ్ల నర్వ వెంకటయ్య గారి భూమి, **దక్షిణము:** సి. వెంకట్‌రెడ్డి గారి భూమి.

శంకర్ నారాయణ ఝవార్, MBA, LL.B., న్యాయవాది.
చంద్రా గార్డెన్ కమాన్ దగ్గర, బాదేపల్లి, జడ్చర్ల,
మహబూబ్‌నగర్ జిల్లా . ఫోన్ నెం.9849573451

సీజనల్ వ్యాధులు రానీయొద్దు

- కలెక్టర్ సంతోష్
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 10 : సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కలెక్టర్‌తోపాటు రాష్ట్ర మలేరియా, ఫైలేరియా అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు సోకితే 9866756825 నెంబన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సాధారణంగా వర్షాకాలంలో మలేరియా, చికున్ గున్యా, అతిసార, విషజ్వరాలు వంటివి ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ, ఫిషరీస్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, మున్సిపల్, పబ్లిక్ రిలేషన్ వంటి శాఖలతో కోఆర్డినేషన్‌తో సీజనల్ వ్యాధులను దూరం చేయాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యాలాంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, రోళ్లు, బాటిల్ మూతలు వంటి వాటిలో వర్షపునీరు చేరడం వల్ల దోమలు గుడ్లు పెట్టి వ్యాప్తి శరవేగంగా జరుగుతుందన్నారు. నీళ్లు నిల్వ లేకుండా ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్‌ను ఏర్పాటు చేయాలని, రాపిడ్ రెస్పాన్స్ టీమ్, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకొని అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించాలి

అర్హులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సందర్శించారు. ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పథకం లబ్ధి చేకూరారన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో గృహజ్యోతి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, 500 గ్యాస్ కనెక్షన్‌కోసం అవసరమైన సరైన ధ్రువపత్రాలతో పాటు ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న రసీదులు పరిశీలించి లబ్ధి చేకూరేలా అవకాశాలు కల్పించాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తో కలెక్టర్ సమావేశమై కార్యాలయ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

ఎత్తం పీఏసీసీఎస్‌లో ఎరువుల శాంపిల్స్‌ను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కోడేరు, జూలై 10 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను కోడేరు మండల వ్యవసాయాధికారి శ్రీరామ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈవో మధుసూదన్‌రెడ్డి, డీలర్లు ఉన్నారు.

చెంచుప్రగతి సేవా కేంద్రాల ఏర్పాటు

అమ్రాబాద్, జూలై 10 : కోనేరు సంస్థ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గంలోని పలు మండలాలతోపాటు అమ్రాబాద్ మండలంలోని వెంకటేశ్వర్లబావి, బీకే ఉప్పునుంతల, పదర మండలంలోని వంకేశ్వరం గ్రామంలో ఆదివాసి చెంచు గిరిజనుల కోసం చెంచుప్రగతి సేవా కేంద్రాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సేవా కేంద్రం ద్వారా గిరిజన చెంచులకు అవసరమయ్యే వ్యవసాయ పనిముట్లను ఉచితంగా అందజేస్తామని సంస్థ కోఆర్డినేటర్ పెద్దులయ్య తెలిపారు. అన్ని రకాల కూరగాయల విత్తనాలను అందజేస్తామన్నారు.

కార్మికుల హక్కులను కాపాడాలి

కొల్లాపూర్, జూలై 10 : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వివిధ కార్మిక సంఘాల నాయకులు కార్మికుల హక్కుల సాధన కోసం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు హన్మంతు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాపాడాలన్నారు. కనీస అవసరాలను తీర్చాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కల్వకుర్తి, జూలై 10 : కల్వకుర్తి మండలం పంజుగుల యూపీఎస్ పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు బుధవారం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కృష్ణయ్య, పాండయ్య, తిరుపతమ్మ బదిలీ వెళ్తుండడంతో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్యగౌడ్, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు గణేశ్, ఉపాధ్యాయులు పుష్పలత, ఉమాదేవి, రామేశ్వరయ్య, ఆంజనేయులు, శివకుమార్, వైడూర్య, భాగ్యమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటయ్య, విజయభాస్కర్, గ్రామ కార్యదర్శి కృష్ణ, జంగయ్య, గ్రామస్తులు షబ్బీర్, ఖాజా, బాలరాజు పాల్గొన్నారు.

చారకొండలో..

చారకొండ, జూలై 10 : మండలంలోని జూపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం హెచ్ఎం ర్యూన్సీరాణి ఆధ్వర్యంలో సన్మానించారు. అదేవిధంగా పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్‌రావు, అంజయ్య, విజేందర్, నారాయణ, అల్లాజీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు, జూలై 10 : మండలంలోని రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం భాస్కర్‌శర్మతోపాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. అలాగే ఇతర పాఠశాలల నుంచి బదిలీపై నలుగురు ఉపాధ్యాయులను బుధవారం వచ్చారు. వీరిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

సన్మానం పొందిన ఉపాధ్యాయులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనిధి

పెద్దకొత్తపల్లి, జూలై 10 : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిధి అన్నారు. పెద్దకొత్తపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రేమాభిమానాలతో ఉండాలన్నారు. బాలికలకు పెండ్లి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఘర్షణలు నెలకొనకుండా ప్రజలంతా కలిసికట్టుగా ఉండాలన్నారు. భూసమస్యలుంటే రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి, సీనియర్ న్యాయవాదులు వసంతరెడ్డి, నిరంజన్, కుర్మయ్య, బాలస్వామి, రాజేశ్, రామలక్ష్మమ్మ, నలిని, పారాలీగల్ అడ్వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మాట్లాడుతున్న డీఎఫ్‌సీఎస్ చైర్మన్ ఆంజనేయులు

నాగర్‌కర్నూల్, జూలై 10 : మత్స్యకారులు తమకున్న వనరులతో ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఎఫ్‌సీఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు అన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్ అధ్యక్షతన సమీకృత కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సమావేశ మందిరంలో జాతీయ మత్స్య కృషీవలుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ చెరువుల్లో చేపల పెంపకంలో సొసైటీ సభ్యులతోపాటు మత్స్య సహకార సంఘాల యువకులు ఆదాయ వనరులు సృష్టించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే మహిళా రుణాలను సంఘాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ అల్లోజీ, డైరెక్టర్లు వెంకటయ్య, నర్సింహా, వెంకటయ్య, ఈశ్వర్, బాలచందర్, అధికారులు అచ్చన్న, సిబ్బంది శ్రీకాంత్, రాహుల్, రాజ్‌కుమార్, సైదులు, జంగయ్య, కేశవులు, రాములు, వెంకటయ్య, తిరుపతయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల దినోత్సవం

బిజినేపల్లి, జూలై 10 : మండల కేంద్రంలోని మత్స్యకారుల భవనంలో బుధవారం జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అల్లోజీ మాట్లాడుతూ మత్స్యకారుల హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, బంగారయ్య, బాలస్వామి ఉన్నారు.

హోమయాగాలతో ప్రజలంతా సుభిక్షం



స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, జూలై 10 : హోమయాగాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని, విద్య అభ్యసన సమయంలో ఆటంకాలు, సంకటాలు కలగకుండా నివారిస్తూ విద్యాప్రాప్తికి గణపతి స్వామివారిని శాస్త్రోక్తంగా హోమాలతో భక్తులు కొలిచారని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో మూడు రోజుల కిందట ప్రారంభమైన చండీయాగ మహోత్సవం బుధవారం కొనసాగింది. చండీ హోమాలు, రుద్రహోమాలు రామాయణం భాగవతా సుందరకాండ చతుర్వేద హోమాలు నిర్వహించారు. సామూహిక హోమాల్లో భాగంగా సంతానప్రాప్తికి పుత్రకామేష్టి హోమాలు నిర్వహించారు. శ్రీసిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా చేపట్టారు. శ్రీకృష్ణ గణపతి స్వామి నామస్మరణతో జయజయ ధ్వనులతో మండపమంతా కిక్కిరిసింది. ఈనెల 11న గురువారం ఉదయం శ్రీ లక్ష్మీ కుమేర సహిత ధన్వంతరి, పుత్ర కామేష్టి హోమాలు, సీతారామ కల్యాణం, వేదమూర్తులైన బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బిజినేపల్లి, జూలై 10 : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెల్గొండలో చోటుచేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం.. వెల్గొండకు చెందిన నాగరాజు(40) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి తమ్ముడితో ఘర్షణ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

నూతన భవనం మంజూరు చేయాలి

బల్మూరు, జూలై 10 : మండలంలోని కొండనాగుల ప్రభుత్వ బీసీ వసతిగృహం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని విద్యార్థి సంఘల నాయకులు, విద్యార్థులు బుధవారం కోరారు. హాస్టల్‌లోని గదుల్లో పైకప్పు ఊడి కందపడుతుందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షకాలంలో నీళ్లు కారి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నూతన భవనం ఏర్పాటు చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బిజినేపల్లి, జూలై 10 : మండలంలోని వడ్డెమాన్‌లో బుధవారం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, రేషన్ డీలర్ రాజేశ్‌కుమార్ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన కాశమ్మ కుమారుడు రెండు వారాల కిందట మృతిచెందగా, తల్లి కాశమ్మకు రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సురేశ్‌కుమార్, నర్సింహా తదితరులు ఉన్నారు.

పరామర్శ..

కల్వకుర్తి, జూలై 10 : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వారణాసి అలివేలు మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బుధవారం 21వ వార్డు కౌన్సిలర్ సైదులుగౌడ్ పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సమకూర్చిన రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

ఉప్పలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే సన్మానం

ఉప్పలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

కల్వకుర్తి, జూలై 10 : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ ఎన్నికల్లో తలకొండపల్లి మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థికి అత్యధిక ఓట్లు సాధించిపెట్టినందుకు ఉప్పలను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి శాలువా కప్పి అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దండ, జూలై 10 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ బాలశంకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు వినియోగించే క్రమంలో సైబర్ నేరాలకు గురవుతున్నారని తెలిపారు. తెలియని లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది భాస్కర్, చంద్రశేఖర్, రవి, కళాశాల సిబ్బంది ఉన్నారు.

నవోదయ పాఠశాల ఆర్చీ ప్రారంభం

నవోదయ ప్రధాన ద్వారాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

బిజినేపల్లి, జూలై 10 : మండలంలోని వట్టెం జవహర్ నవోదయ పాఠశాల వద్ద పూర్వ విద్యార్థుల సౌజన్యంతో ప్రధాన ద్వారం, సెక్యూరిటీ రూంలను బుధవారం షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారుడు మురళీకృష్ణ సౌజన్యంతో ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, జానకిరాములు, భాస్కరాచారి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు రంజిత్, రాధిక, జ్యోతి, శ్రీహరి, జనార్థన్, సంతోష్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కల్వకుర్తి రూరల్, జూలై 10 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు ఎంఈవో బాసునాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు సీబీఎస్ఈ అనుమతి లేకున్నా సిలబస్‌ను నిర్వహిస్తున్నట్లు చెబుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసగిస్తున్నారన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలు, డ్రెస్‌లు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, అర్జున్, నితిన్ ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

వెల్దండ, జూలై 10 : మండలంలోని బొల